క్లుప్తంగా

ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి దళితుల్లో అత్యంత వెనుకబడ్డ డక్కలి తదితర కులాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని 'తెలంగాణ డక్కలి హక్కుల పోరాట సమితి' రాష్ట్ర నాయకులు కర్ణ రామారావు, మహంకాళి ఆశోక్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. దళితబంధు పథకంలో మొట్టమొదటిగా ప్రాధాన్యత తమకే ఇవ్వాలన్నారు. జి.లింగరాజు, రవి, గోపాల్, ప్రభాకర్, మధు, సురేష్, వెంకన్న, తిరుపతి తదితరులున్నారు.

కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయం



అవార్డులను అందజేస్తున్న వేణుగోపాలచారి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కళాకారులను గుర్తించి అవార్డులతో సత్కరించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. ఆదివారం సాంస్కృతిక సంఘం సేవ సంస్థ ఆధ్వర్యంలో పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ శతజయంతి సందర్భంగా నటరాజ నృత్య వైభవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నటి నర్తకి జయలక్ష్మికి నటరాజ రామకృష్ణ పురస్కారం, ప్రముఖ సినీ గేయ రచయిత రాంబాబు గోసాల, బిగ్‌బాగ్ ఫేమ్ సోహెల్‌కు ఉగాది నంది పురస్కారాలను ప్రదానం చేశారు. సమస్త వ్యవస్థాపక కార్యదర్శి సురేందర్, అధ్యక్షులు పుష్పలత, కన్వీనర్ దయాకర్, రాజు, ట్రెజరర్ నవీన్‌కుమార్ తదితరులున్నారు.

కవిత్వం సజీవం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కవిత్వం ఎప్పటికీ సజీవమని ప్రముఖ కవి కె.శివారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కవి సంఘం ఆధ్వర్యంలో కోడూరు విజయకుమార్ అధ్యక్షతన కవిత్వ కూడలిగా 11 ఏళ్ల కవి సంగమం ఓ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శివారెడ్డి హాజరై మాట్లాడారు. గుంటూరు లక్ష్మీ నరసయ్య, ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి, డాక్టర్ శిలా లోలిత, ఎం.నారాయణశర్మ, అనిల్ డ్యానీ, అన్వర్, టి.హిమబిందు పాల్గొని కవిత్వం, రచనలపై పలు విషయాలను చర్చించారు. కవులు మోహనకృష్ణ, నిఖిలేశ్వర్, ఆశరాజు, శీలా సుభద్రాదేవి, శిఖమని, రాజారాం, తగుళ్ల గోపాల్ తదితరులున్నారు.

నాలా పైప్‌లైన్ లీకేజీతో మురుగు పరుగు



వివేక్‌నగర్ హెచ్‌ఎస్‌ఆర్ అరుట్ల రెసిడెన్సీ వద్ద..

చిక్కడపల్లి: గత నెల రోజులుగా గాంధీనగర్ డివిజన్‌లోని త్యాగరాయగానసభ సమీపంలోని హెచ్‌ఎస్‌ఆర్ అరుట్ల రెసిడెన్సీ ఎదుట రోడ్డుపై హుస్సేన్‌సాగర్ నాలా పైపులైన్ నుంచి నీరు లీకై పారుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు వాపోతున్నారు. ఈ నీరు ఉస్మానియా యూనివర్సిటీ నగరంలోని ఇతర పార్కుల నిర్వహణ కోసం అప్పట్లో పైపులైన్‌లను ఏర్పాటు చేశారు. ఈ విషయంపై అనేక సార్లు ఫిర్యాదు చేసిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగుతో రహదారి దుర్గంధ భరింతగా మారడంతో స్థానికులు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. మురుగు కారణంగా దోమలు, ఈగలు వృద్ధి చెంది విష జ్వరాల బారిన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పట్టించుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రైవేటు ఉద్యోగి అదృశ్యం



రాజు (ఫైల్)

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ప్రైవేటు ఉద్యోగి అదృశ్యమైన ఘటన అచ్చయ్యనగర్‌కు చెందిన ఎస్.రాజు (55) ఆదివారం ఉదయం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన భార్య లక్ష్మి సాయంత్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కిరణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలుషిత నీటి సరఫరాతో ఇక్కట్లు

మొదలైన నీటి ఎద్దడి ● లీకేజీలతో రంగుమారుతున్న తాగునీరు

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గంలో నీటి ఎద్దడి మొదలైంది. జలమండలి సరఫరా చేస్తున్న లో ప్రెషర్ నీటి సరఫరాతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా అవుతున్న నేపథ్యంలో కూడా తాగునీరు సరిగ్గా రాక ప్రజలు తాగునీటికి తంటాలు పడుతున్నారు. చాలా ప్రాంతాల్లో బోర్లు లేకపోవడంతో ప్రజలు జలమండలి నీటి సరఫరాపైనే ఆధారపడుతున్నారు.

- నియోజకవర్గంలోని కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని ఆయా ప్రాంతాలు, కాలనీలు, బస్తీలు, మురికి వాడల్లో నాలుగు లక్షల వరకు జనాభా నివసిస్తున్నారు. వీరిలో అధిక శాతం మంది జలమండలి తాగునీటి నల్లాలపైనే ఆధారపడుతున్నారు.
- కొన్నేళ్లుగా వీరికి రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా జరుగుతోంది. శీతాకాలం వరకు నీటి సరఫరా జరిగినా.. ప్రస్తుత వేసవిలో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. తాగునీటి ఇబ్బందులపై ప్రజా ప్రతినిధులు, జలమండలి అధికారులకు మొర పెట్టుకున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- అంబర్‌పేట డివిజన్ అజాద్‌నగర్, కాచిగూడ డివిజన్ నింబోలిఅడ్డ, చెప్పల్‌బజార్,



అజాద్‌నగర్‌లో నల్లాల్లో వస్తున్న కలుషిత నీటిని చూపిస్తున్న ప్రజలు

గోల్నాక డివిజన్ శంకర్‌నగర్ తదితర ప్రాంతాల్లో కలుషిత తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సమస్యాత్మక ప్రాంతాలు..

- లో ప్రెషర్ కారణంగా పలు ప్రాంతాల్లో ప్రజలకు నీటి ఇబ్బందులు తప్పడం లేదు. కాచిగూడ డివిజన్ చెప్పల్‌బజార్, కుత్బిగూడ, వీరన్నగుట్ట, బండల బస్తీ, ఇందిరానగర్, మణియార్ పట్టి, నింబోలిఅడ్డ తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు.
- గోల్నాక డివిజన్‌లోని కృష్ణానగర్, నెహ్రూనగర్, సుందర్‌నగర్, హడ్డి కార్ఖానా, ఖాద్రీబాగ్, తులసీ రాంనగర్ లంక తదితర ప్రాంతాల్లో లో ప్రెషర్‌తో నీటి సరఫరా జరగడం వల్ల ప్రజల అవసరానికి సరిపడా నీళ్లు రావడం లేదు.



నిరుపయోగంగా ఉన్న బోరింగ్

- అంబర్‌పేట డివిజన్‌లోని పటేల్ నగర్, ప్రేమ్‌నగర్, బాపూనగర్, ఆహ్మద్‌నగర్, నల్లకుంట డివిజన్‌లోని తిలక్‌నగర్, మార్కెట్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు.
- నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా అవుతుండటంతో ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది.

బోర్లకు మరమ్మతులు చేయించాలి..

బస్తీల్లో తాగునీటిని అందించడంలో ప్రజా ప్రతినిధులు చొరవచూపాలని ప్రజలు కోరుతున్నారు. బోర్లకు మరమ్మతులు చేపట్టి పవర్‌బోర్లు, సింటెక్స్ ట్యాంకులను వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. నూతనంగా బోర్లను ఏర్పాటు చేయాలన్నారు. ట్యాంకర్ల ద్వారా కూడా తాగునీరు అందించి ఆదుకోవాలని స్థానికులు అధికారులు, ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

సీతారాముల కల్యాణానికి కేంద్రమంత్రికి ఆహ్వానం



కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న దృశ్యం

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో కాచిగూడలోని మున్నూరు కాపు భవన్, వ్యాడం అంజయ్యహాల్‌లో ఈనెల 30న నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ట్రస్ట్‌బోర్డు ప్రతినిధులు ఆదివారం కలిసి ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కల్యాణ మహోత్సవ వేడుకల్లో ప్రజలు, మున్నూరుకాపులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మేనేజింగ్ ట్రస్టీ ఆకుల పాండురంగారావు కోరారు. ట్రస్టీ మంద సూర్యప్రకాష్ తదితరులున్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం



అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి

కాచిగూడ: అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో శోభకృత్ ఉగాది పురస్కారాల ప్రదానం జరిగింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి హాజరై మాట్లాడారు. పద్మశాలి కవులను, కళాకారులను గుర్తించి జాతీయ పురస్కారాలతో సత్కరించడం అభినందనీయమన్నారు. కవులు కవితలను ఆలపించి అందరిని ఆకట్టుకున్నారు. చిక్కా రామదాసు, బైస దేవదాసు, చిక్కా శంకర్, విజయలక్ష్మి, పోచం సుజాత, పులిజాల జనార్దన్, డాక్టర్ వేముల సత్యనారాయణ, కోమల ఉన్నారు.

శోభాయాత్రకు రావాలని ..

అంబర్‌పేట: శ్రీరామనవమి శోభాయాత్రకు హాజరు కావాల్సిందిగా సినీనటి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతికి అంబర్‌పేట నియోజకవర్గ శోభాయాత్ర ఉత్సవ నిర్వాహకులు ఆహ్వానం అందజేశారు. ఆదివారం ఆమె నివాసంలో అంబర్‌పేట మున్సిపల్ మైదానం నుంచి రాంకోఠిలోని హనుమాన్ వ్యాయామశాల వరకు ఈనెల 30న శోభాయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆమెకు వివరించారు. వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, ప్రతినిధులు ఆనంద్‌గౌడ్, బాలకృష్ణగౌడ్, రాంరెడ్డి తదితరులున్నారు.



విజయశాంతికి ఆహ్వానం అందజేస్తున్న వెంకట్‌రెడ్డి తదితరులు

బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నియోజకవర్గంలో పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. పాత, కొత్త పార్టీ కార్యకర్తల సహకారంతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఆదివారం అంబర్‌పేట డివిజన్ ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు సిద్దార్థ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. దీనికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ దాసోజు శ్రవణ్‌కుమార్, తలసాని సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌లు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది ఇతర పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. అనంతరం డివిజన్‌లో తెలంగాణ ఉద్యమ కారులను సత్కరించి వారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. నర్సింహరెడ్డి, ఆంజనేయులు, మల్లేష్‌యాదవ్, సతీష్, లింగారావు, రామారావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి తమలపాకుల అర్చన



ముషీరాబాద్: అడిక్‌మెట్ వీరాంజనేయ స్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 30న శ్రీరామ నవమి సందర్భంగా సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి లక్ష్మారెడ్డి, చైర్మన్ మధుసూదన్‌రావులు తెలిపారు. ఏప్రిల్ 6న హనుమాన్ జయంతి ఉత్సవాలను కూడా ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఆదివారం వీరాంజనేయ స్వామివారికి లక్ష తమలపాకులతో అభిషేకం నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం అడిక్‌మెట్ డివిజన్ మేడిబావి బస్తీలో ప్రసిద్ధిగాంచిన నల్లపోచమ్మ ఆలయ పునర్నిర్మాణ భూమి పూజను వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తనవంతు సాయంగా రూ.2 లక్షల ఆర్థిక సహకారం అందించనున్నట్లు హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకుడు సోమన్, అడిక్‌మెట్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు బల్ల శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీధర్‌చారి తదితరులున్నారు.

హస్త కళలను ప్రోత్సహించాలి

కవాడిగూడ: హస్త కళాకారులను ఆర్థికంగా ఆదుకునేందుకు వారు తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేయాలని హ్యాండీ క్రాఫ్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్, టెక్స్‌టైల్స్ కమిషనర్ సయ్యద్ ముబారక్ అలీ సూచించారు. నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో 'ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ వికాస్ సంస్థాన్' ఆధ్వర్యంలో ఆఫీస్ ది డెవలప్‌మెంట్ కమిషనర్ హ్యాండ్‌క్రాఫ్ట్స్, మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ ఆఫ్ ఇండియా సహకారంతో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ బజార్‌ను శనివారం రాత్రి ఆయన ప్రారంభించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో హస్త కళాకారులు తయారు చేస్తున్న వస్తువులను ప్రదర్శిస్తున్నారని మార్కెట్ రేటు కంటే తక్కువ ధరలకే అందుబాటులో ఉంటాయన్నారు. మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.ప్రభాకరన్, క్రాఫ్ట్ బజార్ కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులున్నారు.

ప్రధాని మన్‌కీ బాత్‌లో పాల్గొన స్థానిక నేతలు

కవాడిగూడ: దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన మన్ కీ బాత్‌లో బీజేపీ నేతలు, నాయకులతో పాటు ప్రజలందరూ కూడా భాగస్వాములు కావాలని కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ జి.రచనశ్రీ పేర్కొన్నారు. ఆదివారం దేశ ప్రధాని మన్ కీ బాత్ సందేశాన్ని ఇచ్చిన సందర్భంగా దోమలగూడలో ఏర్పాటు చేసిన మన్ కీ బాత్ కేంద్రాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దేశ ప్రజల కోసం నిరంతరం ప్రధాని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌ముదిరాజ్, నాయకులు శ్రావణ్‌కుమార్ తదితరులున్నారు.

చిక్కడపల్లి: భారత ప్రధాని నరేంద్రమోదీ 99 మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం చిక్కడపల్లి పెండేకంటి లా కళాశాలలో బూత్ నంబర్ 7లో నిర్వహించిన కార్యక్రమాన్ని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆసక్తిగా తిలకించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు ప్రధాని మోదీ సూచించారన్నారు. సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ నర్సింగ్‌రావు, అధ్యక్షుడు సత్యేందర్, నగర యువ నాయకులు వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు రత్నసాయిచంద్, నాయకులు శ్రీకాంత్, యాదగిరిగౌడ్, చెన్నయ్య, శివ, వనజ, చంద్రకళ పాల్గొన్నారు.

దేవస్థాన ఎన్నికల్లో శంకర్‌గౌడ్ ప్యానల్ విజయం



విజయోత్సవంలో శంకర్‌గౌడ్, అతరి ప్యానెల్ ప్రతినిధులు

అంబర్‌పేట: ఉత్కంఠగా జరిగిన అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఎన్నికల్లో శంకర్‌గౌడ్ ప్యానెల్ విజయం సాధించింది. ఆదివారం అంబర్‌పేట మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఎన్నికల్లో శంకర్‌గౌడ్ అధ్యక్షుడిగా విజయం సాధించడంతో పాటు అతనిడి ప్యానెల్ సభ్యులందరూ విజయం సాధించారు. మొత్తం 640 ఓట్లకు 627 ఓట్లు పోల్ అయ్యాయి. అధ్యక్ష బరిలో ఉన్న శంకర్‌గౌడ్‌కు 305 ఓట్లు, శ్రీరాములుముదిరాజ్‌కు 188, శ్రీనివాస్ ముదిరాజ్‌కు 128 ఓట్లు వచ్చాయి. కాగా శంకర్‌గౌడ్ 117 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా రంగంపల్లి రాజు, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా చెంగలి సుధాకర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా దోమకొండ కిషోర్, కోశాధికారిగా గడ్డం శ్రీధర్‌గౌడ్‌లు విజయం సాధించారు. అనంతరం ఘనంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించి మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆలయ వార్షికోత్సవం

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం పునర్నిర్మాణ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవాచనము, పంచగవ్య ప్రాశన, దేవతాహ్వానం మండపారాధన, అగ్ని ప్రతిష్ఠను ఆలయ అర్చకులు నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాల పూజ కార్యక్రమాలను ఆలయ ముఖ్య అర్చకులు, కె.కృష్ణమూర్తి, బుగ్గా లక్ష్మీపతిశర్మ, కందాళవెంకటాద్రి చేశారు. స్వయంభూ ఆలయాన్ని పునర్నిర్మించిన తర్వాత మొదటి వార్షికోత్సవం కావడంతో భారీగా భక్తులు ఆలయానికి చేరుకుని వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ మురళీ ప్రసాద్, ఈఓ దేవనాథం, సిబ్బంది ఎస్‌బీవీఎస్ ఆచారి, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దళిత బహుజనులు ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్

కాచిగూడ: దళిత బహుజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. ఆదివారం జరిగిన పార్టీ రాష్ట్ర పదాదికారుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో దళిత సీఎం సాధన కోసం ఎన్నికల పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర అవిర్భావ లక్ష్యాన్ని అణగారిన నిమ్నజాతుల ప్రగతిని బీఆర్‌ఎస్ కేసీఆర్ ప్రభుత్వం దెబ్బతీసిందని ఆరోపించారు. కార్పొరేట్ క్రిమినల్ మాఫియా 420 పార్టీల నాయకత్వంలో తెలంగాణలోని దళిత బహుజనులకు రక్షణ ఉండదన్నారు. పార్టీ నేతలు డాక్టర్ రాజు, బీరం సతీష్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, సుబ్బారావు తదితరులున్నారు.

రక్షిత తాగునీరు అందించేందుకు కృషి



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: ప్రజలకు రక్షిత తాగునీరు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన పైపులు చాలా వరకు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటి స్థానంలో కొత్త వాటిని చేపడుతున్నామన్నారు. నల్లకుంట డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్ (కళావతి లైన్)లో గత కొంతకాలంగా లోప్రెషర్ నీటి సరఫరాతో పాటు కుళాయిల ద్వారా కలుషిత నీటి సరఫరా జరుగుతుందనే విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఆదివారం జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. కలుషిత నీటి సరఫరా సమస్యకు శాశ్వత పరిష్కారానికి అవసరమైన ప్రాంతాల్లో నూతనంగా పైపులైన్ వేయాల్సిన అవసరం ఉందన్నారు. బడ్జెట్ నుంచి రూ. 15 లక్షల నిధులు మంజూరు చేయిస్తానని నూతన పైపులైన్ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జలమండలి అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని జలమండలి అధికారులకు సూచించారు. జలమండలి శివం సెక్షన్ మేనేజర్ రోహిత్, బీఆర్‌ఎస్ పార్టీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, నాయకులు విజయేంద్రసాగర్, నరేందర్, భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌గౌడ్, గులాబ్ సతీష్, శివశంకర్, నాగేందర్, బస్తీ పెద్దలు పాల్గొన్నారు.

పరీక్షల సమయానికి ఒత్తిడికి గురికావొద్దు..

కవాడిగూడ: విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని అఖిల భారత యాదవ మహాసభ మాజీ అధ్యక్షులు ఉశికల పాండుయాదవ్ విద్యార్థులకు సూచించారు. ఆదివారం దోమలగూడలోని ముషీరాబాద్ యాదవ మహాసభ అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మ్యాథమాటిక్స్‌లో విద్యార్థులు ఆందోళన చెందుతారన్నారు. ప్రతి ఏటా విద్యార్థుల కోసం ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పాశం అనిల్‌కుమార్‌యాదవ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌యాదవ్, నాయకులు భరద్వాజ్, బలరాంయాదవ్, ఉమామహేశ్వరయాదవ్, కృష్ణయాదవ్, మల్లికార్జునయాదవ్, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

సమ్మేళనాలతో విభేదాలు సమసిపోయేనా!

- ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమంపై ప్రజల్లో ప్రచారం
- ఈ నెల 27 నుంచి వచ్చే నెల 26 వరకు ఆత్మీయ సమ్మేళనాలు

ముషీరాబాద్: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీఆర్‌ఎస్ కార్యకర్తలందరినీ ఏకతాటి పైకి తీసుకొచ్చేందుకు ఆత్మీయ సమ్మేళనాలకు శ్రీకారం చుట్టింది. దాదాపు నెల రోజుల పాటు జరిగే ఈ సమ్మేళనాల్లో ప్రభుత్వ పథకాలపై ప్రచారం కల్పించడంతో పాటు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలని భావిస్తోంది.

- పార్టీ శ్రేణులను సమన్వయపరిచేందుకు ఈ ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తుంది. ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ వంటి పథకాలతో లబ్ధిపొందిన వారి వివరాలను ఆయా డివిజన్ నాయకులకు అందించడం, వారితో నిత్యం సంబంధాలను మెరుగుపరుచుకోవడం వంటి కార్యక్రమాలను నాయకులు కార్యకర్తలకు అందిస్తున్నారు.
- పార్టీలో మొదటి నుంచి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను ఆహ్వానించి వారిని తగిన విధంగా గౌరవించడం ముఖ్యంగా దళితబంధు పథకం వంటి పథకాలతో లబ్ధిపొందిన వారిని వినియోగించుకునే విధానాలపై నాయకులకు దిశానిర్దేశం చేయనున్నారు.
- స్థానిక ఎమ్మెల్యేతో పాటు జిల్లా మంత్రులు, పార్టీ ప్రధాన నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ సమావేశాలకు హాజరై వారి అనుభవాలు, సందేశాలను కార్యకర్తలకు అందించడం వంటి కార్యక్రమాలను కూడా చేపట్టనున్నారు.

సమన్వయం జరిగేనా..?

- ముషీరాబాద్ నియోజకవర్గంలో మొదటి నుంచి గ్రూప్‌ల తగాదా కొనసాగుతూనే ఉంది. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎంఎన్ శ్రీనివాస్‌రావు, రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, శ్రీనివాస్‌రెడ్డిలు ఎమ్మెల్యేతో సరిగ్గా ఉండటం లేదని పలువురు భావిస్తున్నారు. వేర్వేరుగా కార్యక్రమాలను నిర్వహిస్తుండటంతో డివిజన్లలో సైతం గ్రూప్ తగాదాలు కొనసాగుతున్నాయనే ప్రజలు అనుమానిస్తున్నారు.
- ఒక్క అడిక్‌మెట్ డివిజన్‌లోనే నాయకులు, కార్యకర్తలు 4 గ్రూపులుగా విడిపోయినట్టు సమాచారం. రాంనగర్ డివిజన్‌లో వి.శ్రీనివాస్‌రెడ్డి గ్రూపునకు చెందిన నాయకులు ఎమ్మెల్యే గ్రూపు నాయకులతో కలిసేందుకు ఆసక్తి చూపడం లేదనే వార్తలు వినిపిస్తున్నాయి. సమ్మేళనం నిర్వహిస్తే వారు హాజరవుతారా.. లేదా.. అనేది వేచి చూడాల్సిందే.
- ముషీరాబాద్‌లో మాజీ కార్పొరేటర్ హరిబాబు యాదవ్, కవాడిగూడలో కల్వగోపి తదితరులు తమ సొంత గ్రూప్‌లను కొనసాగిస్తూనే ఉన్నారని ప్రజలు చెప్తున్నారు. వచ్చే ఎన్నికల్లో నాయకులందరినీ సమన్వయం చేసే విధంగా నిర్వహించే ఈ ఆత్మీయ సమ్మేళనాలతో నాయకుల మధ్య ఉన్న గ్రూప్ తగాదాలు సమసిపోతాయా లేదా అనేది వేచి చూడాల్సిందే.

ఆత్మీయ సమ్మేళనం షెడ్యూల్..

- ముషీరాబాద్ నియోజకవర్గంలో నెలరోజుల పాటు నిర్వహించే ఈ ఆత్మీయ సమ్మేళన షెడ్యూల్ ఈ విధంగా ఉంది. మొదట మార్చి 27న కవాడిగూడ డివిజన్‌లోని ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరుగుతుంది.
- ఏప్రిల్ 2న అడిక్‌మెట్ డివిజన్‌కు చెందిన ఆత్మీయ సమ్మేళనం అడిక్‌మెట్ కమ్యూనిటీహాల్‌లో జరుగుతుంది.
- ఏప్రిల్ 7న గాంధీనగర్ డివిజన్ సమ్మేళనం జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహిస్తున్నారు.
- 9న ముషీరాబాద్ డివిజన్ ఆత్మీయ సమ్మేళనం పార్శిగుట్ట చౌరస్తాలోని ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతుంది.
- 15న రాంనగర్ డివిజన్ ఆత్మీయ సమ్మేళనం వీఎస్‌టీ యూనియన్ ఫంక్షన్‌హాల్‌లో జరుగుతుంది.
- 16న భోలక్‌పూర్ డివిజన్ సమ్మేళనం హెరిటేజ్ ఫంక్షన్‌హాల్‌లో జరుగుతుంది. ముషీరాబాద్ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం ఏప్రిల్ 26న పింగళి వెంకటరామిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించాలని పార్టీ భావిస్తుంది.
- ఒక్కో డివిజన్‌లో జరిగే సమ్మేళనానికి 500 మందికి తగ్గకుండా కార్యకర్తలను హాజరయ్యే విధంగా చూడాలని ఆయా డివిజన్ అధ్యక్షులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వంతో లబ్ధిపొందిన వారిచే ప్రసంగాలు ఉండేలా చూడడంతో పాటు పార్టీలో తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి పనిచేసిన వారిని ఆహ్వానించే విధంగా నాయకులు ప్రణాళికలు చేస్తున్నారు.